TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

9043514736, 9840467131

చెన్నై | సంపుటి : 03 | సంచిక : 339 | ఆదివారం 06 ఏప్రిల్ 2025 | ఎడిటర్ : సిహెచ్ . ముకుందరావు | పేజీలు : 04 | వెల : 03 | ONLINE E- PAPER

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

# అకారణంగా ఏడుస్తుంటారు

- కొందరికి ఇది అలవాటుగా మారింది.. మనమేం చేయలేం.. స్టాలిన్‌పై మోదీ విమర్శ
- తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి
- తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా
- పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని.. తమిళనాడు సీఎం గైర్హాజరు
- సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్
- వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు
- ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ



తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్‌కోపై ధ్వజమెత్తారు. అలాగే తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ. 8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు.

డాక్టర్లు కావాలని కలలు కంటున్న పేద నేపథ్యం కలిగిన విద్యార్థులకు మేలు చేసేలా వైద్య విద్య కోర్సులను మాతృభాష తమిళంలో బోధించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ చేర్చేందుకు కేంద్రం నిరంతరం కృషిచేస్తోందన్నారు. శ్రీరాముడి జీవితం, సుపరిపాలనా స్ఫూర్తి.. జాతి నిర్మాణానికి ముఖ్యమైన పునాదిగా పని చేస్తాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా పవిత్ర భూమి రామేశ్వరం నుంచి దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

**పాంబన్‌తో ఎంతో మేలు**

'భారతరత్న' డాక్టర్ కలాం జన్మించిన భూమి రామేశ్వరమని ప్రధాని తెలిపారు. ఆయన జీవితం సైన్స్-ఆధ్యాత్మికత సమ్మిళితమని.. కొత్త పాంబన్ వంతెన కూడా సాంకేతిక-సంప్రదాయాల సమ్మేళనంగా అభివర్ణించారు. వేల సంవత్సరాల పురాతనమైన ఈ పట్టణం.. ఇప్పుడు 21వ శతాబ్దపు ఇంజనీరింగ్ అద్భుతంతో.. ప్రధాన భూభాగానికి అనుసంధానమైందన్నారు. పాంబన్ సహా దేశంలో నాలుగు దిక్కులా నిర్మించిన వంతెనలను మోదీ ప్రస్తావించారు. ఉత్తరాన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన రైలు వంతెనల్లో ఒకటని.. పశ్చిమాన ముంబైలో ఇప్పుడు దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెన అటల్ సేతు ఉందని.. తూర్పున అసోంలోని బోగీబీల్ వంతెన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని.. గత పదేళ్లలో శ్రీలంక చెర నుంచి 3,700 మందికి పైగా మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీలంకలో మూడ్రోజుల పర్యటనలో చివరి రోజు ఆదివారం ప్రధాని మోదీ చారిత్రక, ఆధ్యాత్మిక నగరం అనూరాధపురకు వెళ్లారు. అక్కడ రూ. 780కోట్ల భారత్ సాయంతో పునర్నిర్మించిన మహో-ఒమన్థాయ్ రైల్వే లైనును ప్రారంభించారు. తర్వాత జయశ్రీ మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్త మహా థెరి నెలకొల్పిన మహాబోధి వృక్షం వద్ద ప్రార్థనలు చేశారు. మరోవైపు, మోదీ కోరిక మేరకు ఆదివారం 11 మంది తమిళ జాలర్లను శ్రీలంక విడుదల చేసింది.

**అప్పుడూ.. ఇప్పుడూ గుజరాతీ బిడ్డే**

పాంబన్‌లో వందేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యక్తి రైల్వే వంతెన నిర్మించారని, మళ్లీ శతాబ్దం తర్వాత ఇదే స్థలంలో కొత్త వంతెన నిర్మించే అదృష్టం గుజరాతీ బిడ్డ(మోదీ)కే వచ్చిందని మోదీ సభలో వ్యాఖ్యానించారు. పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించి, జాతికి అంకితం చేసిన అనంతరం ప్రధాని.. తమిళ సంప్రదాయ దుస్తులైన ధోవతి, పట్టు చొక్కా, పట్టు అంగవస్త్రం ధరించి రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలయానికి వెళ్లిన ఆయన మూలవిరాట్ ముంగిట నేలపై ఆశీనులై స్వామివారికి మొక్కారు. ఇదిలా ఉండగా, హెలికాప్టర్లో శ్రీలంక నుండి రామనాథపురం మండపం వచ్చేటప్పుడు 'రామసేతు'ను దర్శించుకునే అరుదైన భాగ్యం తనకు కలిగిందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'దైవానుకూలంగా అయోధ్యలో సూర్యతిలకధారణ జరిగే సమయంలో ఈ సేతుబంధనాన్ని వీక్షించాను. ఇలా ఒకే సమయంలో రెండు దర్శనాలు శ్రీరామచంద్రుడి అనుగ్రహమే' అన్నారు.

**పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాలి: స్టాలిన్**

పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి సీఎం స్టాలిన్ హాజరుకాలేదు. ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున ప్రారంభోత్సవానికి రాలేనని ముందుగానే ప్రధానికి తెలియజేశానని ఆయన తెలిపారు. ఆదివారం ఊటీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమిళ గడ్డపై అడుగుపెట్టిన మోదీ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని పార్లమెంటులో విస్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేయాలని.. సముచిత పునర్విభజనకు ఇదొక్కటే మార్గమని.. మోదీ ఈ పనిచేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేపడతామని 2001లో నాటి ప్రధాని వాజపేయి హామీ ఇచ్చారని.. దీనికి కేంద్రం కట్టుబడి ఉండాలని కోరారు.

# పిఠాపురంలో జనసేనానితో ఢీకొడుతున్న వర్మ

(వి న్యూస్, పిఠాపురం)::

నేరుగా కాకున్నా.. పరోక్షంగానైనా పిఠాపురం వర్మ జనసేనానితో యుద్ధానికి కాలు దువ్వుతున్నట్టే కన్పిస్తోంది. పిఠాపురంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అదే రకమైన డౌట్లు వస్తున్నాయి. పిఠాపురం సెగ్మెంట్లో వర్మకు బలం ఉంటే ఉండొచ్చు.. అందులో ఎవ్వరికీ ఎలాంటి సందేహాలు లేవు. కానీ పవన్ కల్యాణ్ లాంటి మాస్ ఇమేజ్ ఉన్న నేతతో.. అది కూడా టీడీపీకి మిత్రపక్షంగా ఉన్న ఓ పార్టీ అధినేతతో నేరుగా యుద్ధానికి దిగేటంతటి రేంజీకి పరిస్థితిని తెచ్చుకోవడం వర్మ రాజకీయ భవిష్యత్తుకే ఇబ్బందని చర్చ ఏపీ రాజకీయాల్లో జరుగుతోంది. దాదాపు ఇదే రకమైన అభిప్రాయం తెలుగుదేశం వర్గాల్లో కూడా వ్యక్తమవుతోంది. గతంతో పోల్చుకుంటే వర్మ విషయంలో టీడీపీ అధిష్టానం.. కేడర్లో సాఫ్ట్ కార్నర్ నెమ్మదిగా తగ్గుతోందనే చర్చ మొదలైంది. అతి సర్వత్రా వర్జయేత్ అన్నట్టుగా.. ఒకసారి.. రెండుసార్లు వరకు ఫర్వాలేదు కానీ.. ప్రతి విషయంలోనూ అదే పనిగా పిఠాపురంలో జనసేనను వెంటాడుతూ రాజకీయం చేస్తే.. అధిష్టానం కూడా సీరియస్ అయ్యే ప్రమాదం లేకపోలేదనే భావన వ్యక్తమవుతోంది. ఈ సమయంలో తెలివిగా ఆలోచించాల్సిన వర్మ.. ఇగోలకు పోతున్నారా..? లేక పక్కనున్న వాళ్లు ఎవరైనా రెచ్చగొడుతున్నారా..? అనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుత, భవిష్యత్తు రాజకీయాలను విశ్లేషిస్తే.. వర్మ సైలెంటుగా ఉండడం వర్మ రాజకీయ భవిష్యత్తుకే మంచిదంటున్నారు. ప్రస్తుతానికైతే.. టీడీపీ-జనసేన విడిపోవడమనేది కలలో మాట. ఇలాంటి పరిస్థితుల్లో పిఠాపురంలో మళ్లీ వర్మకు సీటు దక్కడం కూడా కలేనని చెప్పాలి. ఒకవేళ టీడీపీ-జనసేన విడిపోయి.. వర్మ ఆశించినట్టు టిక్కెట్టు దక్కినా.. అక్కడి నుంచి పోటీ చేసే పవన్ కళ్యాణ్ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించ లేరు. నా బలం సంగతి తెలీదా.. ఇండిపెండెంటుగా గెలిచిన వ్యక్తిని అని వర్మ భావిస్తే.. అది పప్పులో కాలేసినట్టేనని అంటున్నారు. ఇండిపెండెంటుగా అంతగా బలం లేని నాటి టీడీపీ అభ్యర్థిని ఓడించి.. తాను గెలవడం వేరు.. పవన్ను ఓడించడం వేరనే విషయాన్ని వర్మ గుర్తించకుండా.. తనకేదో అపారమైన బలం ఉందని అంచనా వేసుకుంటే ఎలాగనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఒకవేళ వర్మ అంచనా వేసుకున్న విధంగా బలమున్నా.. అది పవన్ కళ్యాణ్ను ఓడించడానికి సరిపోతుందేమో కానీ.. తాను గెలవడానికి ఎంత మాత్రమూ కలిసి రాదనేది ఖాయం అంటున్నారు.



అసలు వర్మ పొలిటకల్ ఫ్యూచర్ బ్రైటుగా ఉండాలంటే పిఠాపురం రాజకీయాల నుంచి వర్మ నిష్క్రమించడం బెటర్ అంటున్నారు. ఈ క్రమంలో పరిస్థితులకు తగ్గట్టు తెలివిగా వ్యవహరించకుండా.. మొండిగా వర్మ వెళ్లడం కరెక్ట్ కాదనే విశ్లేషణలు వస్తున్నాయి. ఇక పార్టీలో కూడా వర్మ వైపు బలంగా నిలబడే వారు ఎవరైనా ఉన్నారా..? వర్మ ఫీలింగ్సును అధిష్టానం వద్ద ప్రస్తావించి.. ఒప్పించే వారు ఎవరైనా ఉన్నారా..? అంటే లేరనే సమాధానమే వస్తుంది. తూర్పు గోదావరి జిల్లాలో వర్మకు అండగా నిలిచి.. వర్మకు అధిష్టానం వద్ద ఓ ఇమేజ్ వచ్చేలా చేయడంలో యనమల రామకృష్ణుడు చాలా ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పుడు యనమలకు కూడా పార్టీలో పెద్దగా ప్రాధాన్యత లేదు. ఈ టైంలో వర్మ రాజకీయ ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించకుండా మొండిగా పోతే ఎలాగనేది ఓ చర్చ. ఏదో ఓసారి ఇండిపెండెంటుగా గెలిచినంత మాత్రాన మళ్లీ స్వతంత్రంగా పోటీ చేస్తా.. గెలిచేస్తాననేది కేవలం అపోహేనంటున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచే పరిస్థితులు ఉన్నాయి. అప్పటికే వర్మ టీడీపీ అభ్యర్థిగా ప్రొజెక్ట్ అయి ఉన్నారు. కాబట్టి.. అక్కడి నుంచి వర్మ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా గెలిచారు. అదే వర్మ 2019 ఎన్నికల్లో ఓడిపోలేదా..? అంటున్నారు. వర్మకు అంత బలమే ఉంటే.. 2019 ఎన్నికల్లో కూడా గెలిచి ఉండాల్సింది కదా అంటున్నారు. 23 మంది గెలిచినప్పుడు.. వర్మ ఎందుకు ఓడిపోయారని ప్రశ్నిస్తున్నారు. స్థానికంగా వర్మ మంచి లీడరే.. కానీ టీడీపీ అనే ప్లాట్ ఫారం ఉండి తీరాల్సిందేననే విషయాన్ని గుర్తెరిగి రాజకీయం చేయాల్సిన అవసరం వర్మకే ఉందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. త్వరలో నియోజకవర్గాల పునర్ విభజన జరుగుతుంది. వర్మ తెలివిగా ఆలోచిస్తే.. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో తనకు అనుకూలంగా ఉండే వాటిని ఎంచుకుని.. అక్కడ టిక్కెట్ సంపాదించుకోవచ్చు. వర్మ లాంటి లీడరుకు టిక్కెట్ ఇవ్వడానికి కూడా పార్టీ అధినాయకత్వం కచ్చితంగా అంగీకరిస్తుంది. ఈ తరహాలో ఆలోచించకుండా.. ఇగోలకు పోయి వ్యవహారాన్ని రచ్చ చేసుకుంటే నష్టపోయేది వర్మేనని గుర్తించాలనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## నీలగిరిలో మినీ టైడల్ పార్క్ : స్టాలిన్



**విల్లివాకం న్యూస్:** ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదివారం 2వ రోజు నీలగిరిలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. రూ. 353 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి, వైద్య సిబ్బంది నివాస భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రసంగించారు. యువత ఉపాధి కోసం నీలగిరిలో మినీ టైడల్ పార్క్ రానుంది. నీలగిరి జిల్లా కూడలూరులో 300 ఇళ్లు, కలైంజర్ నగర్ ఏర్పాటు. గిరిజన మ్యూజియం, పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తారు. గిరిజనుల కోసం 1,000 కాంక్రీట్ ఇళ్లు నిర్మిస్తామన్నారు.

HOMOEOPATHIC CLINIC
Dr. Kolli Raju Consultant
MBS(H), M.D. (Hom)
(35 Years Experienced)
Dr. Parasa Radhamma
DHMS, M.B.S.(Homoeo)
Plot No. 137/33, 3rd Lane,
Kamaraj Nagar, 5th East Street,
Tiruvanmiyur, Near Bus Depot,
Chennai - 600 041.
Consultation Offline and Online also available
WhatsApp Number :
94443 46846

Sri Muneswara
Mob : 90032 12627 / 90032 33359
ஸ்ரீ ஸ்ரீநிவாசா ரியல் எஸ்டேட்
SRI SRINIVASA REAL ESTATE
Land Buying & Selling
No.98, Thiruneelaganda Nagar, Kavangarai, Chennai - 600 066. Email : mukeshnaveen.mg@gmail.com

# ఘనంగా లయన్స్ ఇంటర్నేషనల్ ఉగాది వేడుకలు









**విల్లివాకం న్యూస్:** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 324ఎం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. దీనికి చెన్నై, కొరట్టూరులో గల మోహన్ గార్డెన్స్ ఆడిటోరియం వేదికయింది. పిఎంజెఎఫ్ లయన్ టి సురేష్, లయన్ కె రమేష్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ పీఎంజేఎఫ్ లయన్ ఎన్ వరదరాజన్ విచ్చేశారు. గౌరవ అతిథులుగా తమిళనాడు అడిషనల్ డీజీపీ డి. కల్పనా నాయక్, ఐపీఎస్, ఏఐటిఎఫ్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి, ప్రముఖ సినీనటి కలైమామణి డాక్టర్ జి జయచిత్ర, ఎస్కెడిటి హయ్యర్ సెకండరీ స్కూల్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీఎం కిషోర్ పాల్గొన్నారు. ఇందులో లయన్ ఎన్. శ్రీధర్ లయన్ ఎస్.బోస్, లయన్ రాజేష్ ఎం జోషి, లయన్ పిఎన్ఎస్ ఉదయ సూర్యన్ సత్కారాలను అందుకున్నారు. ముందుగా లయన్ సురేష్ స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథి వరదరాజన్ సభికులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సురేష్ రమేష్ చక్కగా కార్యక్రమ ఏర్పాట్లు చేశారని, అలాగే సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ సిఎంకె రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం అన్నారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని తెలిపారు. నటి జయచిత్ర మాట్లాడుతూ ఇక్కడ పండుగ వాతావరణం తలపిస్తోందని, ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని, తెలుగు వారంతా కలిసి సంతోషంగా గడపాలని అన్నారు. ఇందులో సీఎం కిషోర్, శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. లయన్ మీనాక్షి సుందరం, చంద్రశేఖర్, శేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో శేషాద్రి బృందం పంచాంగ శ్రవణం చేశారు. కల్పన శ్రీనివాస్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, ఎస్కెడిటి పాఠశాల విద్యార్థుల నృత్యాలు, గాయకులు రాము, శ్రీవర్ధిని సంగీత విభావరి అలరించాయి. వ్యాఖ్యాతగా డాక్టర్ ఏవి శివకుమారి వ్యవహరించారు.

## సిటీఏ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మహోత్సవం



**విల్లివాకం న్యూస్:** చెన్నై తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమి, సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పోరూరు ఆర్కాట్ రోడ్డు లోని రాజ్యలక్ష్మి మహల్ (ఏఆర్ఎస్ గార్డెన్స్, నాయుడు హాల్ ఎదురుగా) ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపిన శ్రీ సీతారామ కల్యాణానికి సిటిఏ సభ్యులు మరియు ఇతర తెలుగువారు 500 మందికి పైగా హాజరయ్యారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు కల్యాణాన్ని తనివితీరా తిలకించి ప్రసాదాలు, తలంబ్రాలు స్వీకరించి సిటిఏ వారు ఏర్పాటు చేసిన కల్యాణ విందు భోజనాన్ని ఆరగించారు. ఈ కార్యక్రమంలో సిటిఏ అధ్యక్షులు కే గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి బి వెంకయ్య నాయుడు, ఉపాధ్యక్షులు గాడిపర్తి సురేష్, విజయేంద్ర రావు, కోశాధికారి నాగరాజు, కల్చరల్ సెక్రటరీ ఏవి శివకుమారి, జాయింట్ సెక్రటరీలు రామయ్య, శ్రీనుబాబు, కమిటీ సభ్యులు మధుకర్, వెంకటరమణయ్య, రాంప్రసాద్ మరియు అడ్వైజరీ కమిటీ సభ్యులు చలపతి, పీవీ రవికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆదివెలమ' ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణం



**విల్లివాకం న్యూస్:** బందరు ఆదివెలమ బంధు సమూహం ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ వైభవం ఆదివారం ఘనంగా జరిగింది. దీనికి చెన్నై పెరంబూరు, సిరువల్లూరు రోడ్డులోని బిఏవిపిఎస్ ఫంక్షన్ హాలు వేదికయింది. ఇందులో అభిషేకం అనంతరం అలంకారం, వేద పారాయణం జరిగాయి. కల్యాణ మహోత్సవం తాంద్ర అశ్వని శాస్త్రి అండ్ పార్టీ, చెన్నై వారు నిర్వహించారు. అనేకమంది భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఇందులో కల్యాణ మహోత్సవ భోజనము పరిమి ప్రసాదరావు స్పాన్సర్ చేశారు. ఇందులో ప్రసాదరావు, హనుమంతరావు, గిరిధరరావు, రాధేష్ బాబు, హను బాబు, జయశ్రీ, ఎం.ఎస్.రావు, లోకేష్, గిరి కోటేశ్వరరావు, మోహన్ కృష్ణ, రాజశ్రీ, పరిమి బాలాజీ, కె.వి కిషోర్, వినోద్ పాల్గొన్నారు.


# మదనపల్లెలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





**మదనపల్లె, న్యూస్ :**

మదనపల్లెలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులోభాగంగా వాడవాడలా సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయాల్లో అభిషేకం, కళ్యాణోత్సవాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతోపాటు సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, అన్నదానం పంపిణీ చేశారు. స్థానిక గొల్లపల్లెలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆరోవార్డు కౌన్సిలర్ కొండుపల్లె ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వైసీపీ మదనపల్లె నియోజకవర్గ ఇన్చార్జి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డిలు ముఖ్యఅతిథిలుగా హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నదానం చేశారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో ఐదోవార్డు ఇన్చార్జి ఆదినారాయణ, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఫ్యాక్టరీ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ సీనియర్ నేత లియాఖత్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు అన్నదానం చేశారు. బయారెడ్డికాలనీలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ విశ్వనాథ, ధర్మకర్త నాగరాజ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాంచినబాబు ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే అన్నదానం చేశారు. నీరుగట్టువారిపల్లెలోని పాతూరులో నూతనంగా నిర్మించిన భద్రాద్రి రామాలయంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానికులు రామ్మోహన్, నాగిరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేష్, వెంకటరమణలు గ్రామస్తులతో కలసి నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా అమ్మినేనివీధి, సొసైటీకాలనీలోని రామాలయాల్లో



నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కాగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# వైభవంగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం








**విల్లివాకం న్యూస్:** శ్రీ ఆంధ్ర కళాస్రవంతి ఆధ్వర్యంలో 36వ సంవత్సర శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం స్థానిక కొరట్టూరు అగ్రహారం, అన్నై అవెన్యూలోగల శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో ఆదివారము ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు వైభవంగా జరిగింది. పురోహితులు సుసర్ల కుటుంబ శాస్త్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం కల్యాణోత్సవం జరిపారు. కన్నుల పండుగగా జరిగిన ఈ వేడుకలో 2,000 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. శ్రీ ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షులు జె.ఎం. నాయుడు, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవి రమణ, సలహాదారులు ఎంఎస్ మూర్తి, ఉపాధ్యక్షులు వివిఎస్ హరినాథ్, పి సరస్వతి, కేవిఎస్ సురేష్ బాబు పాల్గొన్నారు. చివరిగా భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు. ఎస్ వివిఎస్ ట్రస్ట్ ప్రధాన స్పాన్సర్ గా వ్యవహరించారు. సీతారామ భజన కార్యక్రమము సా. 5.00 గం.ల నుండి 8.00గం.ల వరకు జరిగింది. సోమవారం శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమం జరగనుంది.


## ఆస్కా ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా శ్రీరామనవమి కళ్యాణ వేడుక.



**టీ నగర్ న్యూస్:**

శ్రీరామనవమి సందర్భంగా చెన్నై టీ నగర్ , విజయ రాఘవ రోడ్ లో ఉన్న ఆస్కా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కళ్యాణ మహోత్సవం సాంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ కె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొని ఉత్సాహంగా నిర్వహించారు. వడపప్పు, పానకం, స్వామివారి ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆస్కా మేనేజింగ్ ట్రస్ట్ పి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించగా సభ్యులు తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

## రామనగర్ లో శ్రీ సీతారాముల కల్యాణం



**విల్లివాకం న్యూస్:** తెలుగు ప్రజలు అధికంగా నివసించే ట్రిప్లికేన్, రామనగర్ లోని శ్రీ కోదండరామ భక్త భజన మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణం వేద పండితులు, ఊరి పెద్దలు, పుర స్త్రీల సమక్షమున మధ్యాహ్నం 12:00 గంటలు 1:30 గంటల మధ్య అందరి జరిగినది. తర్వాత శ్రీరామదాసు అన్న ప్రధ సుఖీభవ కమిటీ తరపున సహపంక్తి భోజనము జరిగింది. సాయంత్రము సీతారాముల ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమములు రాంనగర్ ఆది ఆంధ్ర సంక్షేమ సంఘం, శ్రీ కోదండ రామ భక్త భజన బృందం, శ్రీరామదాసాంజనేయ స్వామి ఆలయ సంఘ సభ్యులు, పెద్దలు, యువకులు అందరూ కలిసి జయప్రదముగా జరిపారు.

తెలుగు న్యూస్ టైమ్స్



# సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు








**చెన్నై న్యూస్:** చెన్నై కొడుంగయూర్ సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఇక్కడి తెలుగు ప్రజలు ప్రతి ఏడాది శ్రీరామనవమి పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లో జరిగే విధంగా తెలుగుదనం ఉ ట్టిపడేలా ఏర్పాట్లు చేసి, సాంప్రదాయబద్ధంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సీతారామ కళ్యాణ వేడుకలను సంఘ నిర్వాహకులు ఎంతో ఘనంగా చేశారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారిని అలంకరించి, వేద మంత్రాల మధ్య కళ్యాణం నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు ఎంతో తెలుగుదనం ప్రతిబింబించేలా పూజా సామగ్రితో కళ్యాణ వేడుకల్లో పాల్గొనడం విశేషం. ఈ వేడుకల్లో పెరంబూర్ ఎమ్మెల్యే ఆర్.డి. శేఖర్, అన్నాడీఎంకే యువజన విభాగ ఉప కార్యదర్శి ఈ. లక్ష్మీనారాయణ, 34వ డివిజన్ కౌన్సిలర్ షర్మిలా గాంధీ కర్ణ, ఏఐటీఎఫ్ నాయకులు జనార్దన్, వంజరపు శివయ్య, మాజీ అధ్యక్షులు కుటుంబరావు, మాజీ కార్యదర్శి పట్టాభిరామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ కళ్యాణ ఏర్పాట్లను సంఘ ప్రెసిడెంట్ బి. సురేష్ బాబు, సెక్రటరీ పాతూరి లక్ష్మణరావు, కోశాధికారి టి. పిచ్చేశ్వరరావు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, బి. శ్రీధర్ పర్యవేక్షించగా, కమిటీ సభ్యులు మరియు తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ ధర్నా



**వేలూరు న్యూస్:** దేశ వ్యాప్తంగా ఉన్న ముస్లిం, మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంతీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో వేలూరు అన్నారోడ్డులో ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈధర్నాలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టీకా రామన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ముస్లీం, మైనారిటీలపై కక్ష సాధింపు కోసమే కొత్త కొత్త చట్టాలను తీసుకొస్తుందన్నారు.. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యదర్శి ఉపాధ్యక్షులు ధర్నాలో వాహీద్బాషా ఆ పీపీ పార్టీ చంద్రప్రకాష్ రాష్ట్ర, కార్యకర్తలు ఎస్సీ, మాజీ, ఎస్టీ పాల్గొన్నారు కార్పొరేటర్ విభాగం. జయప్రకాష్ రాష్ట్ర కార్యదర్శి, మైనారిటి చిత్తరంజన్ విభాగం, తదితరులు పాల్గొన్నారు.

# వేలూరు, తిరువణ్ణామలైలో శ్రీరామ నవమి వేడుకలు



**వేలూరు న్యూస్:** వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలో శ్రీరామ నవమిని పురష్కరించిని ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణలు చేశారు.దీంతో ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడింది. రాణిపేట జిల్లా వాలాజలోని దన్వంతరి ఆరోగ్య పీఠంలో శ్రీరామ నవమిని పురష్కరించుకొని పీఠాధిపతి మురళీధర స్వామిజీఅద్వర్యంలో పీఠంలో ప్రతిష్టించిన శ్రీ పట్టాభిషేక రాముడికి మహా అభిషేకం, పుష్పాలంకరణలు చేశారు. ముందుగా ఉదయం 6 గంటలకు మహా గణపతి పూజ,గోపూజ, 1008 కళశాలకు ప్రత్యేక పూజలు, లక్ష్మి పూజ, సకల దేవతా హెూమం, మహాసంకల్పం జరిగింది. ఉదయం 10 గంటలకు దన్వంతరి మూలమంత్ర జపం, పట్టాభి రాముడికి మహా అభిషేకం, మహా పూర్ణాహుతి, చతుర్వేద పారాయణం, ప్రసాదవినియోగం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో కలుసుకొనివేద పండితులు వేద మంత్రాలు చదివి పూజలు చేసి దేశ క్షేమం కోసం ప్రత్యేక యాగ పూజలు చేశారు.

# తండయారుపేట నెహ్రూ నగర్‌లో ఘనంగా శ్రీరామనవమి ఉత్సవం





**టీ నగర్ న్యూస్:** చెన్నై ఆర్కే నగర్ నియోజకవర్గంలోని తండయారుపేట, నెహ్రూ నగర్‌లోని శ్రీరామాలయంలో శ్రీరామనవమి కళ్యాణ ఉత్సవం ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఇక్కడ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 కుటుంబాల తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. వారు స్వయంగా నిధులు సేకరించి శ్రీరామాలయాన్ని నిర్మించుకుని ప్రతి ఏడాది ఉగాది, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా వంటి తెలుగు పండుగలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో ఈ ఏడాది శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ప్రధాన వీధిని విద్యుత్ దీపాలతో, మామిడి తోరణాలతో సజ్జం చేసి సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు.

ఈ కళ్యాణ పీఠలపై గ్రామానికి చెందిన దంపతులు ౦ దాసరి సాంబశివరావు–దుర్గ, దాసరి బాలాజీ–జయలక్ష్మి, తలారి గాంధీ–కనక మహాలక్ష్మి ౦ కళ్యాణ దండలు మార్చుకొని పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు వడపప్పు, పానకం, స్వామివారి ప్రసాదం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. రాత్రికి శ్రీ సీతారాములను పలు రకాల పుష్పాలతో అలంకరించి, విద్యుత్ దీపాల మధ్య పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రెసిడెంట్ ఐ.వి. బాలాజీ, సెక్రటరీ జి. బాబు, కోశాధికారి పి. ప్రకాష్ బాబు, ఉపాధ్యక్షులు ఏ. సురేష్, దాసం బాలాజీ, సహాయ కార్యదర్శులు ఆర్. నాగరాజు, ఆర్. బాజీబాబు, సహాయ కోశాధికారులు పి. ఉదయకుమార్, శశికుమార్ పర్యవేక్షించగా, తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# రాజకీయ రంగం వేడెక్కుతోంది: నిర్మలా సీతారామన్ తో సెంగొట్టయన్, సీమాన్ భేటీ



**గిండి న్యూస్:**ఎంజిఆర్ అతికడవు–అవినాశి ప్రాజెక్టు పూర్తి వేడుక సందర్భంగా అనాది కాలం నుండి ప్రభావవంతమైన నాయకుడిగా ఉన్న సెంగొట్టయన్ మరియు ఎడప్పాడి పళనిస్వామి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం చెలరేగింది. సెంగోట్టయన్ ఆ సంఘటనను పట్టించుకోకుండా ఎడప్పాడి పళనిస్వామిని తప్పించారు. దీంతో పార్టీలో కలకలం రేగింది. శాసనసభ కార్యక్రమాల్లో కూడా ఆయన ఎడప్పాడి పళనిస్వామిని కలవకుండా ఉన్నారు.ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తు ఉండదని చెబుతూ వచ్చిన ఎడప్పాడి పళనిస్వామి అకస్మాత్తుగా ఢిల్లీలో కేంద్ర మంత్రి అమిత్ షాను కలిశారు. అదే రోజు రాత్రి, కేంద్ర మంత్రి అమిత్ షా %శ% సైట్‌లో 2026లో తమిళనాడులో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం ఏర్పడుతుందని పోస్ట్ చేశారు.ఈ పరిస్థితిలో, చెన్నైకి వచ్చిన ఎడప్పాడి పళనిస్వామి, “జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అమిత్ షా పోస్ట్ చేసి ఉంటే, అది ఆయన కోరిక, ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు మాత్రమే కూటమిని ప్రకటించవచ్చు” అని అన్నారు.దీని తరువాత, అన్నాడీఎంకే మాజీ మంత్రి సెంగొట్టయన్ రహస్యంగా ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ సహా నాయకులను కలిశారు. ఈ విషయాన్ని ఢిల్లీ బిజెపి తమిళనాడు విభాగానికి చెందిన కొందరు కార్యనిర్వాహకులు తెలిపారు.ఈ పరిస్థితిలో, సెంగొట్టయన్ చెన్నైలో ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారని వార్తలు వచ్చాయి. నామ్ తమిళర్ సమన్వయకర్త సీమాన్ కూడా నిర్మలా సీతారామన్‌ను కలిశారని కూడా వార్తలు వచ్చాయి.దీనితో పాటు, తమిళనాడు రైట్ టు లైఫ్ పార్టీ నాయకుడు పన్రుట్టి వెల్మురుగన్ కూడా శనివారం రాత్రి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై మాట్లాడారని నివేదికలు సూచిస్తున్నాయి.అన్నాడీఎంకే–బీజేపీ పొత్తు చర్చలు జరుగుతున్న తరుణంలో, మాజీ మంత్రి సెంగొట్టయన్ కేంద్ర మంత్రితో సమావేశం ఇప్పుడు చాలా ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.పళనిస్వామి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలిసి మాట్లాడారు.

# ప్రధానమంత్రి మోదీ పర్యటనకు వ్యతిరేకంగా ఆదివారం చెన్నైలో భారత సంకీర్ణ పార్టీలు నల్ల జెండాలతో నిరసన



**అన్నానగర్ న్యూస్:**ప్రధాని మోడీ తమిళనాడు పర్యటనను ఖండిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాల నిరసన కార్యక్రమం జరుగుతుందని, భారత కూటమి పార్టీలు ఇందులో పాల్గొంటాయని తమిళనాడు కాంగ్రెస్ నాయకుడు సెల్వపెరుంధగై ప్రకటించారు.దీని ప్రకారం, ఆదివారం చెన్నైలో సైదాపేట కలైంజ్ఞర్ కర్వ్ దగ్గర నిరసన ప్రదర్శన నిర్వహించడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు సెల్వపెరుందగై నాయకత్వంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది.ఎండిఎంకే, కమ్యూనిస్ట్ ఆఫ్ ఇండియా, మణియత్నేయ మక్కల్ కట్చి, మక్కల్ నీది మైయం, మరియు ఆమ్ ఆద్మీ పార్టీలతో సహా పార్టీలు ఇందులో పాల్గొన్నాయి.మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.


మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇస్లామిస్టులపై దాడులు పెరుగుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండుగా విభజించి దానికి రాష్ట్ర హెూదాను తొలగించింది.దేశవ్యాప్తంగా జనరల్ సివిల్ కోడ్ అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నం ముస్లిం వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసింది.కొత్తగా ప్రవేశపెట్టబడిన వక్ఫ్ సవరణ బిల్లులో అనేక అవకతవకలు ఉన్నాయి. ఇది రాజకీయ రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధం.ఉదాహరణకు, గతంలో ఎవరైనా మదర్సాలకు విరాళం ఇవ్వగలిగేవారు. దీనిని సుప్రీంకోర్టు కూడా గుర్తించింది.కానీ ప్రస్తుత సవరణ చట్టం ప్రకారం, ఒకరు 5 సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నారని నిర్ధారించబడితేనే దానిని మంజూరు చేయవచ్చు.అదేవిధంగా, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను కూడా నియమించాలని పేర్కొన్నారు. మరి, హిందూ దేవాలయాలకు ముస్లింలను ట్రస్టీలుగా నియమించవచ్చా?ఒక మతం యొక్క ఆరాధన, ఆస్తి లేదా చట్టాలలో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. వారు ఇప్పుడు ముస్లింలపై చర్యలు తీసుకుంటున్నట్లే, భవిష్యత్తులో క్రైస్తవులపై కూడా చర్యలు తీసుకోవడం ప్రారంభిస్తారు.బిజెపి, ఆర్ఎస్ఎస్ హిందూ రాష్ట్రం అనే తప్పుడు విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వక్ఫ్ సవరణ చట్టం చెల్లదని సుప్రీంకోర్టు ఖచ్చితంగా ప్రకటిస్తుందనీ పేర్కొన్నారు.

# ఇళ్ల అమ్మకాలు డౌన్

**- హైదరాబాద్‌లో 47 శాతం!**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై మాత్రం మెరుగుపడుతున్న సూచనలు కనిపించడం లేదు. నిజానికి దేశవ్యాప్తంగా డౌన్ ట్రెండ్‌ఉంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు తగ్గిపోయాయి. గతేడాది తొలి త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది జనవరి–మార్చి కాలంలో దేశంలోని అన్ని ప్రధాన 23 శాతం మేర ఇళ్ల అమ్మకాలు తగ్గిపోయాయి. ఇది రియల్ ఎస్టేట్ స్లంప్‌ను చూపిస్తోందని అనుకోవచ్చు. ఈ నగరాల్లో హైదరాబాద్ కూడా ఉంటుంది. కానీ హైదరాబాద్ పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది.

జాతీయ సగటు23 శాతంతో పోలిస్తే హైదరాబాద్ లో గృహ విక్రయాలు ఏకంగా 47 శాతం మేర పడిపోయాయి. ఈ ఏడాది జనవరి–మార్చి కాలంలో హైదరాబాద్‌లో 11,114 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదవుతాయని రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా వేసింది. గతేడాది ఇదే సమయంలో 20,835 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదే కాస్త స్లో అనుకుంటే ఈ ఏడాది మరింతగా అమ్మకాలు తగ్గిపోవడం రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న దారుణ పరిస్థితులకు అద్దం పడుతోంది.



కరోనా తర్వాత చాలా మంది సొంత ఇళ్ల కోసం ఆసక్తి చూపించారు. ఆ సమయంలో డిమాండ్ విపరీతంగా పెరిగింది.కొనుగోలు శక్తి ఉన్న వారంతా అప్పట్లోనే కొనేశారు. ఈ కారణంగా డిమాండ్ పడిపోయింది. రాను రాను ఇంకా పడిపోతోంది. తర్వాత వడ్డీరేట్లు పెంచడం, ఐటీ రంగంలో అనిశ్చితి. ఎన్నికలతో పాటు అనేక కారణాల వల్ల మళ్లీ ఇళ్ల అమ్మకాలు పుంజుకోవడం లేదు. అదే సమయంలో బిల్డర్లు చాలా వరకూ మధ్యతరగతికి దూరంగా వెళ్లిపోయి లగ్జరీకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ కూడా గ్యాప్ వస్తుంది. పరిస్థితి ఎప్పటికి చక్కబడుతుందో ?

# మాతృభాషను పిల్లలకు నేర్పించుకుందాం...!








**చెన్నై న్యూస్:** మన మాతృభాష తెలుగులో మన పిల్లలకు నేర్పించుకొని బ్రతికించుకుందామని కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కె ఎస్ వి వి ప్రసాద్ పిలుపునిచ్చారు. చెన్నై పాత చాకలిపేట లోని కనికల గుడిలో సర్ త్యాగరాయ కళాపరిషత్, నార్త్ మద్రాస్ ఉగాది నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శ్రీ విశ్వావసు నామ ఉగాది ఉత్సవాల లో ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గాయకుడు ఎం ఆర్ సుబ్రహ్మణ్యం ప్రార్థన గీతం పాలపించగా సూరతి బలరాం స్వాగతం పలుకుగా, శ్రీ కృష్ణ గీతా సమాజం వారు గీతా పారాయణం చేశారు. ఉగాది సందర్భంగా మా నెల్లూరు దేవి మాధవయ్య పంచాంగ శ్రవణం గావించారు. చిన్నారులు ప్రదర్శించిన వేషధారణ సభకులను అలరించింది. పాత్రి యాటిక్ తెలుగు పాటలు కుమారి శ్రీనిక ఆలపించగా, బేబీ నేహా లవిశెట్టి వినోద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ కి నందివర్మ, ఎం ఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కే ఎస్ వి వి ప్రసాద్, సరే త్యాగరాయ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎం మునిరత్నం, చెన్నపూరి దేవాంగ సంఘ అధ్యక్షులు కేకే జనార్ధనం, విశిష్ట అతిథిగా మాచర్ల మునిరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కె ఎస్ వి.వి ప్రసాద్ మాట్లాడుతూ మన మాతృభాష అయినా తెలుగును బ్రతికించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని, మరి ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు తెలుగు భాషను నేర్పించాలని, ఎన్ని భాషలు నేర్చుకున్న ఎలాంటి ఇబ్బంది ఉండదని అయితే మాతృభాషను మరవకూడదన్నారు. నార్త్ మద్రాస్ ఉగాది కార్యక్రమములో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. నిర్వాహకులను అభినందించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్ త్యాగరాయ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మానమ మునిరత్నం ఉగాది గురించి ఉపన్యసిస్తూ ఉగాది రోజున సేవించే పచ్చడిలో కొత్త చింతపండు, లేత మామిడి చిగుళ్ళు, అశోకవృక్షం చిగుళు ), కొత్తబెల్లము, వేపపూత, రెమ్మలు ( ఆ రోజు కోసినది) మామిడికాయ ముక్కలు, చెరుకు ముక్కలు, జీలకర్ర వీటితో ఉగాది ప్రసాదం తయారు చేయాలని, దీనిని పరగడుపున (కాళీ పొట్ట) ఏమీ తినకుండా తినడం ఆరోగ్యానికి మంచిదని, వసంత కాలంలో సాధారణంగా వచ్చే రుగ్మతులకు ఈ ఉగాది పచ్చడి చక్కటి ఔషధమని ఉగాది పండుగ రోజున దేవాలయాలలో సాయంత్రం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తారని,ఈ పంచాంగ శ్రవణం మనం తప్పక వినాలని చైత్రశుద్ధ పాఢ్యమి నాడు పంచాంగ శ్రవణం వలన ఐదు అంగాలైన తిథి, వారం, నక్షత్రం, యోగం కరణాల యొక్క పలితాన్ని తెలుసుకోవడం ద్వారా, మానవునికి గంగాస్నానం వల్ల లభించే పుణ్యంతో సమానమైన ఫలితం లభిస్తుందని తెలియజేశారు. విద్యార్థులకు నిర్వహించిన సాహితీ కార్యక్రమాలు, సంస్కృతిక పోటీలు, పాటలు వేడుకలు వినోదాలు నిర్వహించిన తీరును కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించిన బృందాన్ని మెచ్చుకున్నారు.

విద్యార్థులకు ఆటలు వేడుకలు వినోదుల అవసరమని నొక్కి చెప్పారు. తనను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహక బృందానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. తన చేతుల మీదుగా విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం ఎంతో సంతోషదాయకుని తెలియజేశారు. అనంతరం పద్య పోటీలు, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, చిత్రవేషధారణ, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మన్ని వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేయగా ప్రముఖ న్యాయవాది జక్కుల హరికృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం కొనే ముందు ఈ విషయాలు చెక్ చేసుకోండి !



భూమి, బంగారం పై పెట్టుబడి ఎప్పటికీ లాభమే. భూమి ఇప్పుడు చిన్నచిన్న ప్లాట్లుగా .. ఇంటి స్థలాలుగా కొనుగోలు చేసి పెట్టుబడిగా అట్టి పెట్టుకుంటున్నారు. అయితే ఇంటి స్థలం కొనుగోలు చేసే ముందు కొన్ని కీలక అంశాలను పరిశీలించాలి. ముందుగా టైటిల్ డీడ్ క్షణ్ణంగా తనిఖీ చేయడం చాలా ముఖ్యం. టైటిల్ డీడ్‌ను తనిఖీ వల్ల ఆ భూమి ఎవరిదో తెలుస్తుంది. భూమి యజమానికి మాత్రమే ఆ భూమిని అమ్మే హక్కు ఉంది. స్థలం అమ్మే వ్యక్తి పేరు మీద ఆ భూమి రిజిస్టర్ అయిందో, లేదో చూడటానికి మ్యుటేషన్ రికార్డులను కూడా తనిఖి చేయాలి. కొనబోయే భూమి రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ తీయించుకోవాలి. ల్యాండ్ ఒరిజినల్ ఓనర్ కాకుండా వేరే ఎవరైనా మోసపూరితంగా మీకు ఆ భూమిని అమ్ముతున్నా, అది ప్రభుత్వ భూమి/అసైన్డ్ ల్యాండ్ అయినా, డబుల్ రిజిస్ట్రేషన్ జరిగినా, ఆ భూమిని తనఖా పెట్టి రుణం తీసుకున్నా%ొ% టైటిల్ డీడ్‌ను చెక్ చేయిచడం వల్ల తెలుస్తుంది. అసలు ఆ భూమి రిజిస్టర్ అయిందో, లేదో కూడా తెలుస్తుంది. %జుజ% వల్ల ఆ ప్లాట్‌లో ఏవైనా లోపాలు లేదా మోసాలు ఉంటే తెలుస్తాయి. %జుజ%ని, రిజిస్ట్రేషన్ పేపర్లను, లింక్ డాక్యుమెంట్లను రిజిస్ట్రార్ ఆఫీస్ దగ్గర ఉండే బ్రోకర్‌కు చూపించి చెక్ చేయించుకోవాలి. లాయర్ అభిప్రాయం కూడా తీసుకోవాలి. రియల్ ఎస్టేట్ కంపెనీ వేసే వెంచర్‌లో ప్లాట్ కొంటుంటే, వెంచర్ బుక్ అని ఉంటుంది దానిని కచ్చితంగా తీసుకోవాలి. ఆ వెంచర్ ప్లానింగ్ సహా అవసరమైన అనుమతి పత్రాల నకళ్లు వెంచర్ బుక్‌లో ఉంటాయి.

## మ్యాట్రిమోనీ యాప్‌లో పరిచయమైన వ్యక్తిని నమ్మింది.. తన శీలాన్ని కోల్పోయింది..

హైదరాబాద్‌కు చెందిన ఒక యువతి ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తి చేతిలో లైంగిక వేధింపులకు, ఆర్థిక దోపిడీకి గురైంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా, చిల్కల్‌గూడ పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడు, నాగోల్ నివాసి అయిన 34 ఏళ్ల కొర్రా రాజా అలియాస్ కొర్రా రాజ్ చౌహాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మాయమాటలతో నమ్మించి బాధితురాలిని లైంగికంగా లోబరుచుకున్నట్లు నిందితుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. బాధితురాలు ఏప్రిల్ 1న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. చిల్కలగూడ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ బి. అనుదీప్ మాట్లాడుతూ.. నిందితుడు మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా యువతిని సంప్రదించాడని, ఆమె నమ్మకాన్ని సంపాదించడానికి మూడు నెలలపాటు మాయ మాటలు చెప్పినట్లు గుర్తించారు. ఆమెతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పరచుకున్న తర్వాత, పలుమార్లు ఆమెపై లైంగిక దాడి చేశాడు. తరువాత ఆమె సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించి ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. రూ. 1.5 లక్షలు బలవంతంగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొర్రా రాజాకు ఆల్రెడీ మ్యారేజ్ అయినట్లు పోలీసుల విచారణలో



బయటపడింది.

అతను మహిళలను ట్రాప్ చేసేందుకు మ్యాట్రిమోనియల్ సైట్లలో అనేక నకిలీ ప్రొఫైల్‌లను సృష్టించాడని పోలీసులు చెబుతున్నారు. బాధితులను ఆర్థికంగా, మానసికంగా దోపిడీ చేసేవాడని వెల్లడించారు. విచారణలో, నిందితుడు వివాహ యాప్‌ల ద్వారా చాలామంది మహిళలను వేధించినట్లు అంగీకరించాడు. పోలీసులు మ్యాట్రిమోనియల్ యాప్ నుంచి చాట్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీ రుజువులు, ఇతర డిజిటల్ ఆధారాలతో సహా బలమైన ఆధారాలను సేకరించారు.

## స్వచ్ఛమైన నెయ్యి, కల్తీ నెయ్యి అని గుర్తుపట్టడం ఎలా..?



దేశంలో ఆహార పదార్థాల కల్తీ అనేది ఒక మాఫియాలా తయారైంది. ఇందులో భాగంగా పోలీసులు చాలామందిని అరెస్ట్ చేస్తున్నా ఈ దందా మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా మనం రోజు వాడే నెయ్యి విషయంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. నిజమైన నెయ్యి, నకిలీ నెయ్యి రెండూ మార్కెట్లలో అమ్ముడవుతున్నాయి. అటువంటి పరిస్థితిలో మీరు నెయ్యి తినడానికి ఇష్టపడితే జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత మాత్రమే కొనండి. కల్తీ నెయ్యిని తయారు చేయడానికి చాలా చెడ్డ పదార్థాలు ఉపయోగించబడుతున్నాయి. స్వచ్ఛమైన దేశీ నెయ్యిని గుర్తించడానికి ఈ టెక్నిక్స్‌ని వాడండి.

కల్తీ నెయ్యిని తయారు చేయడానికి 40 శాతం నూనె, 60 శాతం ఫార్చ్యూన్ కూరగాయను కలుపుతారు. ఇది కాకుండా ఉడికించిన బంగాళాదుంపలు, బిటుమెన్ దీనికి జోడిస్తారు. ఫార్చ్యూన్ వృక్షసంపద కణిక అందుకే కల్తీ నెయ్యిలో వాడతారు. అయినప్పటికీ నాణ్యతను మెరుగుపరచడానికి 5 నుంచి 10 శాతం నిజమైన స్థానిక నెయ్యి కూడా కలుపుతారు. అంతేకాదు సెయింట్ విత్ నెయ్యి కూడా కలుపుతారు.

**నిజమైన నెయ్యిని ఎలా గుర్తించాలి..**

1. నెయ్యి కల్తీ అయిందా తెలుసుకోవడానికి మీరు ఒక పాత్రలో ఒక చెంచా నెయ్యిని వేడి చేయాలి. వెంటనే కరిగి దాని రంగు గోధుమ రంగులోకి మారితే అది స్వచ్ఛమైన స్థానిక నెయ్యి. పసుపు రంగులోకి మారితే అది కల్తీ నెయ్యి అవుతుంది.
2. దేశీ నెయ్యిని గుర్తించడానికి చేతిలో కొంత నెయ్యి ఉంచండి. తరువాత చేతిని తలక్రిందులుగా రుద్దండి. నెయ్యిలో ధాన్యం ఉంటే అది నకిలీదని అర్థం చేసుకోండి. నిజమైన నెయ్యి చేతికి రాసిన వెంటనే గ్రహించబడుతుంది. ఇది గుర్తించడానికి సులభమైన మార్గం.
3. ఒక చెంచా నెయ్యిలో నాలుగైదు చుక్కల అయోడిన్ కలపండి. రంగు నీలం రంగులోకి మారితే నెయ్యి లోపల ఉడికించిన బంగాళాదుంపల టింక్చర్ ఉంటుంది.
4. ఒక టీస్పూన్ నెయ్యిలో ఒక టీస్పూన్ హైడ్రోక్లోరిక్ ఆమ్లం, ఒక చిటికెడు చక్కెర కలపండి. నెయ్యి రంగు ఎరుపు రంగులోకి మారితే కల్తీ నెయ్యి.

# ఈ భార్యాభర్తలకు ఇదేం పోయే కాలం..

**నిరుపేద బాలికలు, కాలేజీ అమ్మాయిలతే వాళ్ల టార్గెట్..!**

వరంగల్‌లో చీకటి దందాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోలీసులు ఎంతా నిఘా పెట్టినా.. ఎన్ని కేసులు పెట్టినా.. వ్యభిచార గృహాల నిర్వాహకులు మాత్రం ఏమాత్రం భయపడకుండా ఈ గలీజ్ దందాను మాత్రం ఆపడం లేదు. పేద కుటుంబాల బాలికలు, కాలేజీ అమ్మాయిలనే టార్గెట్‌గా చేసుకుని.. మాయమాటలతో ట్రాప్ చేసి వ్యభిచార కూపంలోకి దింపుతూ వారి జీవితాలు నాశనం చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఈ గలీజ్ దందా నడిపిస్తున్న ఓ జంటను.. వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు తెలుసుకుని.. రెడ్ హ్యాండెడ్?గా పట్టుకున్నారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, డబ్బులు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

కొద్ది రోజుల క్రితం దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ఒక మహిళ.. తల్లిదండ్రులు లేని ఒక మైనర్ బాలికను ట్రాప్ చేసి వ్యభిచారంలోకి దింపిన ఘటన ఉలిక్కిపడేలా చేసింది. కాగా.. వరంగల్ నగరంలో ఇదే తరహాలో చాలా మంది అమాయక అమ్మాయిలను ట్రాప్ చేసి బిజినెస్ చేస్తున్నారు. ఇలా దందా చేస్తున్న ఇద్దరు దంపతులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం (ఏప్రిల్ 05) రోజు రాత్రి పట్టుకున్నారు. వారి దగ్గర నుంచి రెండు స్మార్ట్ ఫోన్లు, రూ. 1500 నగదు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

మామునూరు పీఎస్ పరిధిలోని గవిచర్ల రోడ్డు దగ్గర రాజీవ్, సునీత అనే దంపతులు కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలనే లక్ష్యంగా చేసుకుని డబ్బు ఆశ చూపి వ్యభిచారంలోకి దింపుతున్నారు. రాజీవ్, సునీత దంపతులు వ్యభిచారం చేస్తున్నారని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో.. రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ దాడిలో.. ఓ బాధితురాలిని వ్యభిచార గృహం నుంచి విడిపించారు. విటుడు వరంగల్ ఫోర్ట్‌లోని కాశీకుంటకు చెందిన వ్యక్తి పరారయ్యాడు. రాజీవ్, సునీత దంపతులను




అరెస్ట్ చేసి మామునూరు పోలీసులకు అప్పగించారు.

రాజీవ్, సునీత దంపతులు వ్యభిచారం మీదే ఆధారపడి జీవిస్తున్నారని పోలీసులు తెలిపారు. చుట్టుపక్కల ఉండే పేద కుటుంబాల అమ్మాయిలను, కాలేజీ స్టూడెంట్లను ట్రాప్ చేసి వ్యభిచార కూపంలోకి దింపుతున్నట్టు పోలీసులు వెల్లడించారు.. గతంలో కూడా రాజీవ్, సునీత దంపతులు ఇదే పని చేస్తూ పోలీసులకు పట్టుబడినట్టు తెలిపారు.

గతేడాది అక్టోబర్ 29న కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక డిగ్రీ స్టూడెంట్‌కు డబ్బు ఆశ చూపి వరంగల్ తీసుకొచ్చారు. ఇక్కడ వ్యభిచారం చేయించాలని ప్లాన్ చేయగా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రైడ్ చేసి వారిని పట్టుకున్నారు. ఆ తరువాత కరీంనగర్ జిల్లాకు చెందిన డిగ్రీ స్టూడెంట్‌ను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. రాజీవ్, సునీత దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

కొద్దిరోజులు జైలుకు వెళ్లి వచ్చిన రాజీవ్, సునీత దంపతులు మళ్లీ అదే పని మొదలుపెట్టారు. దీంతో పోలీసులు వారిని మళ్లీ అరెస్ట్ చేశారు. పేద కుటుంబాలకు డబ్బు ఆశ చూపి వ్యభిచారం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు సరిగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

"ఇలా అమ్మాయిలు, కాలేజీ స్టూడెంట్స్ ను వ్యభిచార రొంపిలోకి దింపి, వారి జీవితాలు నాశనం చేస్తున్న గ్యాంగ్ లపై ఫోకస్ పెట్టాలని, పీడీ యాక్టులు పెట్టి మరోసారి ఈ దందా సాగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు." అని స్థానికులు కోరుతున్నారు.